మందకొడిగా దాళ్వా వరి నాట్లు

- సంక్రాంతి ముగిసినా ఇంకా పూర్తికాని వరి నాట్లు
- పీఆర్ 126, ఎంటీయూ 1121 వరి రకాలు సాగు
- ముందుగా నాటిన వరి పైరుపై దుబ్బు తెగులు

భీమడోలు: మండలంలో రబీ నాట్లు మందగొడిగా కొనసాగుతున్నాయి. వాస్తవానికి సంక్రాంతికి వరి నాట్లు ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా ఇంకా నాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మరో వారం రోజుల్లో నాట్లు వేసే ప్రక్రియ పూర్తవుతుందని సంబంధిత అధికారులు అంటున్నారు. దాళ్వా దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడం, కూటమి ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం భరోసా సొమ్ములు ఇవ్వకపోవడంతో రైతులు రబీ సాగుకు పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యక్తుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీనితో పాటు సార్వాలో కురిసిన భారీ వర్షాల వల్ల దాళ్వా పంట సాగుపై తీవ్ర ప్రభావం పడింది. దీనితో ఏటా సంక్రాంతి నాటికి నాట్లు పూర్తి అవుతుండగా రైతుల ఒడిదొడుకుల మధ్య సాగు చేస్తుండడంతో అలస్యానికి కారణమని పలువురు అంటున్నారు. మండల వ్యాప్తంగా 12,873 ఎకరాల విస్తీర్ణం దాళ్వా సాగు జరుగుతుండగా ఇప్పటి వరకు 9,800 ఏకరాల్లో నాట్లు పూర్తి అయ్యాయని ఏవో ఎస్‌పీవీ ఉషారాణి తెలిపారు. మిగిలిన 3వేల ఎకరాల్లోని నాట్లు నాలుగైదు రోజుల్లో పూర్తవుతాయని చెబుతున్నారు. మండలంలోని రైతులు 120 రోజుల స్వల్ప కాలిక వరి వంగడాలైన పీఆర్ 126, ఎంటీయూ 1121 సాగు చేస్తున్నారని, దీని వల్ల పంట రైతులకు ముందుగానే అందుతుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.


కురెళ్లగూడెంలో వరి నాట్లు వేస్తున్న రైతులు

మెట్ట గ్రామాల్లో రైతుల ఆందోళన

దెందులూరు: మండలంలోని మెట్ట గ్రామాల్లో వరిపై దుబ్బు తెగులు ఆశించింది. శ్రమించి రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. ఒకవైపు ప్రకృతి సహకరించక మరోవైపు ప్రభుత్వం రైతు భరోసా సాయం అందించగా నరకయాతన అనుభవిస్తున్నామని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. దీనికి తోడు వరిలో దుబ్బు తెగులు ఆశించడంతో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని బాధిత రైతులు నరేంద్ర తదితరులు వాపోయారు. సాగు ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు ఒక ఎకరానికి రూ. 22వేలకు పైగా ఖర్చు అయిందన్నారు. ఊడ్పు ఊడ్చి 35 రోజులు అయిందని ఇంతలోపే దుబ్బు తెగులు తమ పాలిట శాపంగా మారిందని వాపోతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయి ఉద్యోగులు తెగులు సోకిన వరి పొలాలను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై రైతులకు శాఖపరమైన సూచనలు, సలహాలు ఇస్తే కొంతమేరకైనా తమకు ఉపయోగం ఉంటుందని రైతులు అంటున్నారు.


వరికి సోకిన తెగులును చూపిస్తున్న రైతు

రేపటి నుంచి భీమడోలు రైల్వే గేటు మూత

భీమడోలు: భీమడోలు- పూళ్ల రైల్వే స్టేషన్ల మధ్య భీమడోలు రైల్వేగేట్ ట్రాక్ అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 20 సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు తాత్కాలికంగా గేటు మూసివేస్తున్నట్లు సంబంధిత ఏలూరు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ తెలిపారు. ఈ క్రమంలో గేటు మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు, రైతులు, విద్యార్థులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

బాదంపూడి దత్త క్షేత్రంలో పూజలు

ఉంగుటూరు: బాదంపూడి దత్త బాల సుబ్రహమణ్యస్వామి ఆలయానికి దత్త పీఠాధిపతి జగద్గురు గణపతి సచ్చిదానంద స్వామీజీ వచ్చారు. ఆలయంలో ఆయన శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. గణపతి స్వామీజీకి ఆలయ నిర్వాహకులు కలవచర్ల శ్రీనివాసు దత్త భక్తులు స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు గణపతి స్వామీజీని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శరణాల మాలతీ రాణి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దళితుల శ్మశాన వాటిక సమస్య పరిష్కరించాలి


అర్ధవరం దళితుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం జిల్లా నాయకుడు జక్కంశెట్టి

గణపవరం: అర్ధవరంలోని దళిత వాడలో దళితులకు ఏళ్ల తరబడి ఉన్న శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం అర్ధవరం దళితవాడలో దళితుల సమస్యల అధ్యయనం చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఆయన దళితులతో గ్రూపు సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. దళితులు 500 పైగా కుటుంబాలు ఉండగా చిన్న శ్మశాన వాటిక మాత్రమే ఉందని, దీనికి అదనంగా కనీసం అర ఎకరం స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఉపాధి హామీ పథకం పని దినాలను కనీసం 200 రోజులకు పెంచాలని, కనీస వేతనం రూ.500 ఇవ్వాలని ప్రజలు కోరారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, చిన్నం చిననాగేశ్వర రావు, మేడిసెట్టి పెంటారావు తెలిపారు.

బండారు కన్నయ్యకు ఘన నివాళి


కన్నయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు, నాయకులు

ఉంగుటూరు: ఎంపీటీసీ ఛాంబర్ మండల అధ్యక్షుడు, నారాయణపురం ఎంపీటీసీ బండారు నాగరాజు తండ్రి కన్నయ్య ఇటీవల మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం నారాయణపురంలోని నాగరాజు ఇంటికి వచ్చి పరామర్శించారు. కన్నయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వాసుబాబుతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, నారాయణపురం ప్రముఖుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బళ్ల త్రిమూర్తులు, ఉంగుటూరు ఎంపీటీసీ సభ్యుడు పెనుగొండ బాలకృష్ణ, వెల్లమిల్లి ఉప సర్పంచి నాగు, నాయకుడు కొరిపల్లి శ్రీను పరామర్శించిన వారిలో ఉన్నారు.

రేషన్ డీలర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భీమడోలు: మండలంలో ఖాళీగా ఉన్న నాలుగు చౌక డిపోల డీలర్లను శాశ్వత ప్రాతిపదికన నియమించేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భీమడోలు సీఎస్‌డీటీ జి.భరత్‌కుమార్ శనివారం తెలిపారు. మండలంలోని అంబర్‌పేట పంచాయతీలోని వడ్లపట్లలోని రేషన్ దుకాణాన్ని ఓసీ (పీహెచ్), దుద్దేపూడిలో (ఓసీ), సూరప్పగూడెంలో బీసీ-సీ(మహిళ), పాతూరులో ఓసీ అభ్యర్థులకు కేటాయించినట్లు తెలిపారు. 18 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు గలవారు అర్హులని తెలిపారు. ఈనెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు అందజేయాలని ఆయన సూచించారు. దరఖాస్తుతో పాటు కులం, రేషన్‌కార్డు, వయస్సు, ఆధార్‌కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం తదితర పత్రాలను జతపర్చాలని ఆయన కోరారు.

ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీ సంస్థలో కార్గో విభాగం అభివృద్ధికి నిరంతరం లైసెన్స్ పోర్టర్లు శ్రమిస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని లైసెన్స్ పోర్టర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వేముల రాంబాబు డిమాండ్ చేశారు. ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్స్ సర్వసభ్య సమావేశం స్థానిక కొత్త బస్టాండ్‌లో యూనియన్ గౌరవాధ్యక్షులు ఉప్పులూరి హేమ శంకర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. రాంబాబు, సీపీఐ నేత డేగా ప్రభాకర్, ఏఐటీయూసీ నేత బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చి బాబు మాట్లాడారు. ఈ సందర్భంగా ఏలూరు శాఖ నూతన కమిటీని రాంబాబు ప్రతిపాదించగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. అధ్యక్షులుగా తమ్మిశెట్టి రమణయ్య, కార్యదర్శిగా గుంజే శ్రీను ఎన్నికయ్యారు. సమావేశంలో లైసెన్స్ పోర్టర్స్ యూనియన్ సభ్యులు దాశిపల్లి కోటయ్య, గుంజె నాగరాజు, గుంజె వెంకటేష్, దాశిపల్లి ఆదినారాయణ, వేముల శీను, దాచుపల్లి ఎర్రయ్య, గుంజే నరేష్, తురక బక్కయ్య, వేముల చిన్ని, ప్రశాంత్ పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్ర రావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో డిసెంబర్ 28 నుంచి నిర్వహిస్తున్న శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. శనివారం స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

ఉంగుటూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని క్రాఫ్ జిల్లా కో ఆర్డినేటర్ ఆర్. వినోద్‌కుమార్ అన్నారు. బాదంపూడిలో చైల్డ్ రైట్స్, చైల్డ్ మ్యారేజీ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆధ్వర్యంలో శనివారం బాల్యవివాహాల నిరోధంపై ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ యువకుడికి 21, యువతికి 18 ఏళ్లు నిండకుండా బాల్య వివాహం చేయడం చట్ట విరుద్ధమని అన్నారు. చిన్న వయస్సులో బాలికకు వివాహం చేస్తే రక్త హీనత శారీరక సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. అనేక రుగ్మతలతో పాటు, ఆర్థిక సమస్యలతో బాలిక అనేక ఇబ్బందులు పడుతుందని వివరించారు. బాల్యవివాహాలు ఆపడం అందరి బాధ్యత అన్నారు. బాల్యవివాహాలు చేస్తే టోల్ ఫ్రీ నంబర్లు 112, 109 సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. ప్రతి గ్రామాన్ని బాల్య వివాహరహిత గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు. బాల్యవివాహాలు వద్దు-చదువు ముద్దు నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


బాదంపూడిలో బాల్య వివాహ చట్టంపై అవగాహన ర్యాలీ

4 నుంచి అచ్చమ్మ పేరంటాలు తల్లి మహోత్సవాలు


ఉత్సవాల ఏర్పాట్లను వివరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మవారు

దెందులూరు: కోస్తా జిల్లాల్లో నమ్మిన భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ప్రసిద్ధిగాంచిన దెందులూరు మండలం గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాల షెడ్యూల్‌ను ఆలయ కమిటీ సభ్యులు శనివారం అమ్మవారి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. వచ్చే నెల 4 నుంచి 12వ తేదీ వరకు అమ్మవారి 68వ మహోత్సవాలు జరుగుతాయన్నారు. 4న ఉత్సవాల ప్రారంభిస్తారని, రాత్రి కదిలి వచ్చిన కనకదుర్గ నాటక ప్రదర్శన, 5న రాత్రి మ్యూజిక్ షో, మిమిక్రీ సత్య ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు. 6న యువ ఈవెంట్స్ నెల్లూరు వారితో డ్యాన్స్ ఎంటర్‌టైన్‌మెంట్, 7న సినీ గాయని ఊహ- నేహ ప్రదర్శన, ఏలూరు బాయ్స్ ఆర్కెస్ట్రా ప్రదర్శన ఉంటుందన్నారు. 8న అపూర్వ నాలుగు రత్నాలు వివిధ నాటకాల సీన్ల ప్రదర్శన, 9న వైజాగ్‌కు చెందిన రోషన్ లాల్ ఆర్కెస్ట్రా, 10న దేవనర్చకి నాటక ప్రదర్శన ఉంటున్నారు. 11న సన్ని, 12న మధ్యాహ్నం ఒంటిగంటకు భక్తుల సమక్షంలో అమ్మవారి ఆలయ ఆవరణలో అగ్నిగుండ ప్రవేశం, రాత్రి సత్య హరిచంద్ర నాటకం ప్రదర్శన ఉంటుందన్నారు. 13న ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయ ఆవరణలో అన్న మహా సమారాధన నిర్వహిస్తామన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.3 లక్షల విరాళం


దాత విష్ణువర్ధన దేవికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు


దాత శోభనాద్రికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ముగ్గురు భక్తులు వేర్వేరుగా శనివారం రూ. 3,00,232 విరాళంగా అందజేశారు.దెందులూరుకు చెందిన కొడాలి విష్ణువర్ధన దేవి రూ.1,00,116, భీమడోలుకు చెందిన దాసరి శోభనాద్రి రూ.1,00,116, హైదరాబాద్‌కు చెందిన జి.సూర్య నారాయణ రాజు రూ.1,00,000 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాలను అందించారు. అనంతరం దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

సువార్తరాజును అభినందించిన డీఈవో

నిడమర్రు: ఢిల్లీలో ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో నిర్వహించిన పరీక్షలపై చర్చలో పాల్గొన్న నిడమర్రు గాదిరాజు గోపాలకృష్ణంరాజు జెడ్పీ హైస్కూల్ ప్లస్ విద్యార్థి రాకాడ సువార్తరాజును శుక్రవారం డీఈవో వెంకటలక్ష్మమ్మ అభినందించారు. జాతీయ స్థాయిలో కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన ఈ సదస్సుకు మన రాష్ట్రం నుంచి 8 మంది విద్యార్థులకు అవకాశం లభించగా వీరిలో జిల్లా విద్యార్థి సువార్తరాజు ఉండటం గర్వకారణమని ఈ సందర్భంగా డీఈవో అన్నారు. గైడ్ టీచర్ కోల్లేపర కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రధానమంత్రి చర్చలో శారీరక, మానసిక అభివృద్ధిలో ఆహారం ప్రభావం, దాని పాత్రను విద్యార్థి సువార్తరాజు చర్చించినట్లు తెలిపారు. విద్యార్థిని అభినందించిన వారిలో సమగ్రశిక్ష అధికారి పంకజ్ కుమార్, ఎంఈవోలు శ్రీనివాస్, భాస్కర్‌కుమార్, హెచ్‌ఎం రాజేశ్వరి తదితరులున్నారు.


ప్రధానితో పరీక్షలపై చర్చలో పాల్గొన్న సువార్తరాజును అభినందిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

'అభయ'పై అవగాహన

ఏలూరు టౌన్: జిల్లాలో మహిళలు, బాలికలు, విద్యార్థినులు, వృద్ధుల రక్షణకు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక చొరవతో అభయ పోలీస్ రక్షక దళాన్ని ఏర్పాటు చేశారు. ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు, ఎస్సై క్రాంతిప్రియ ఆధ్వర్యంలో అభయ పోలీస్ రక్షక దళం స్కూల్స్, కాలేజీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్స్, రద్దీ ప్రాంతాల్లో బాలికలు, యువతులు, మహిళలకు రక్షణగా నిలుస్తున్నారు. ఇదే తరహాలో జిల్లా వ్యాప్తంగా అభయ రక్షక దళంపై ప్రజలకు అవగాహన కల్పించటంతోపాటు, సామాజిక దురాచారాలను రూపుమాపేందుకు ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా అభయ చైతన్య రథంపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్స్‌పై సైబర్ నేరాలు, బాలిక వివాహాలు, సాంఘిక దురాచారాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రశాంతంగా ముగిసిన నవోదయ ప్రవేశ పరీక్ష

భీమడోలు: భీమడోలులో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కేటాయించిన రెండు పరీక్షా కేంద్రాల్లో ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు పరీక్ష జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులను హాల్ టికెట్ ఆధారంగా కేటాయించిన పరీక్షా గదుల్లోకి వారిని అనుమతి ఇచ్చారు. హాల్ టికెట్‌తో పాటు విధిగా ఆధార్ కార్డును చూపితేనే వారిని కేంద్రంలోకి అనుమతించారు. ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలను అనుమతించలేదు. భీమడోలులోని జెడ్పీ ఉన్నత పాఠశాల, శ్రీచైతన్య స్కూలుల్లోని పరీక్షా కేంద్రాల్లో భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు మండలాల్లోని 542 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా కేవలం 176 మంది విద్యార్థులు పరీక్షా రాసారు. దీనితో 34 శాతం నమోదైంది. భీమడోలు చీఫ్ సూపరిండెంటెంట్ బి.శ్రీనివాసరావు, చైతన్య పాఠశాల చీఫ్ సూపరిండెంటెంట్ పయ్యావుల సాయిబాబు పర్యవేక్షణలో పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. భీమడోలు ఉన్నత పాఠశాలలో 292 మందికి 91 మంది, చైతన్య స్కూల్లో 240 మందికి 85 మంది పరీక్షకు హాజరయ్యారు. 25 మంది ఇన్విజిలేటర్లు పని చేసారు. వివిధ మండలాల నుంచి తమ పిల్లలను పరీక్షా కేంద్రానికి తీసుకుని వచ్చేందుకు తల్లిదండ్రులు అవస్థలు పడ్డారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతూ ఆరో తరగతి జవహార్ నవోదయ పాఠశాలల్లో చేరేందుకు ఈ ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించాల్సి ఉంది. అయితే ఈ ప్రవేశ పరీక్షను సంక్రాంతి సెలవుల్లో నిర్వహించడం, ఇతర కారణాల రీత్యా 356 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.


భీమడోలులో నవోదయ పరీక్ష నోటీసు బోర్డును చూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

గణపవరం: నవోదయ ప్రవేశ పరీక్ష ఆదివారం గణపవరంలో ప్రశాంతంగా జరిగింది. గణపవరం బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్షను గణపవరం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, ఎంఈవో-2 గొర్రెల బాలయ్య పరిశీలించారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో బాలయ్య మాట్లాడుతూ గణపవరం పరీక్షా కేంద్రంలో మొత్తం 238 మంది అభ్యర్థులకు 90 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. 148 మంది అభ్యర్థులు పరీక్ష రాశారని తెలిపారు. పరీక్షాధికారి బాలభాస్కరరావు పర్యవేక్షించారు.


గణపవరం నవోదయ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంఈవో

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి

ఉంగుటూరు: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతను అందరూ గుర్తించి మెరుగైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం ఉంగుటూరు మండలం బాదంపూడిలో స్వచ్ఛ దివస్ -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం శ్రమదానం చేశారు. గ్రామస్తులకు తడి చెత్త, పొడి చెత్త సేకరణకు డస్ట్ బిన్లు పంపిణీ చేశారు. ధర్మరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం నిర్వహించబోయే స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రజలంతా అంకితభావంతో భాగస్వామ్యమై పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవో రాజీమనోజ్, ఏఎం సీ మాజీ చైర్మన్ పాతూరి విజయకుమార్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రాంబాబు, ఈవోపీఆర్డీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


బాదంపూడిలో డస్ట్ బిన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

దెందులూరు: ఆరోగ్యకరమైన జీవనానికి పరిశుభ్రత ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరి జీవితంలో పరిశుభ్రత భాగం కావాలని, మెరుగైన ఆరోగ్యంతో పది కాలాల పాటు సంతోషంగా జీవిస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శనివారం దెందులూరులో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్-2025 కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో దోమల నివారణకు చెత్తాచెదారం పెరగకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సర్పంచ్ తోట ఏసమ్మ, నియోజవర్గ క్లస్టర్ గారపాటి కొండయ్య చౌదరి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఇప్పిలి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి అనూష ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ 2025 కార్యక్రమాన్ని దెందులూరు మండలం అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మోతుకూరి నాని, మండల గ్రామ స్థాయి నాయకులు సచివాలయ ఉద్యోగులు పని చేశారు. తొలుత ఎమ్మెల్యే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ పసుమర్తి మధుబాబు, కసుకుర్తి రామకృష్ణ, సాగునీటి వినియోగదారుల గోదావరి కాలువ డీసీ చైర్మన్ వెలమాటి రాంబాబు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పరిరక్షణ లక్ష్యంగా స్వచ్ఛ ఆంధ్ర

భీమడోలు: గ్రామాల్లో పారిశుద్ధ్య పరిరక్షణ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తన వంతు పని చేయాలని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. మండల వ్యాప్తంగా శనివారం పంచాయతీలు, ఆసుపత్రులు, గ్రంథాలయాల్లో పలు కార్యక్రమాలను చేపట్టారు. పోలసానిపల్లిలో సర్పంచ్ షేక్ రహీమాబేగం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ సునీత ఆధ్వర్యంలో ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రం చేసారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ కార్యదర్శి యు.జయరామకృష్ణ, వీఆర్వో సాల్మన్ పాల్గొన్నారు.

కంటి వైద్య సేవలు పునరుద్ధరించండి

దెందులూరు: జిల్లాలో అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కంటి వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు సేవలను పునరుద్ధరించాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి, ప్రధాన కార్యదర్శి కాటి సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా నాయకులు కొవ్వలిలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామ శివారు పట్టణ ప్రాంతాల్లో పేద బడుగు, బలహీన, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల ప్రజలు గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయడంతో ప్రభుత్వ వైద్యశాలల్లోనే కంటి వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేయడంతోపాటు కళ్లజోళ్లు అందించేవారని వారన్నారు. దీంతో పేద ప్రజలు ప్రైవేటు వైద్యశాలకు వెళ్లే అవసరం తప్పిందని అన్నారు. ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలో అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కంటి వైద్య సేవలను నిలుపుదల చేశారని విమర్శించారు. కంటి వైద్య సేవల సౌకర్యం లేదని ఆస్పత్రుల వద్ద నోటీసులు పెడుతున్నారని, దీంతో పేదలు కంటి వైద్యానికి సంబంధించి కార్పొరేట్ వైద్యశాలకు ప్రైవేటు వైద్యశాలకు వెళ్లక తప్పడం లేదని వాపోయారు. ప్రైవేటు వైద్యంలో వేలాది రూపాయలు ఖర్చు కారణంగా అనేక మంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అందరికీ ఉపయోగపడే కంటి వైద్య సేవలందించే పథకాన్ని కూటమి ప్రభుత్వం నిలుపుదల చేయటం అత్యంత దుర్మార్గమన్నారు. ఉద్దేశపూర్వకంగా ప్రజాపయోగ పథకాలను నిలుపుదల చేస్తున్నారని విమర్శించారు. చిన్నారులు, వృద్ధులతోపాటు ప్రతి ఒక్కరి కంటి వైద్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కంటి వైద్య పరీక్షలను పునఃప్రారంభించాలని డీబీఆర్‌కే చౌదరి, కాటి సుధాకర్ కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


22 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఉంగుటూరు: కాగుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002-2003 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక శనివారం అదే పాఠశాలలో నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు పలువురు హాజరై పరస్పరం యోగ క్షేమాలను తెలుసుకున్నారు. చిన్నప్పటి జ్ఞాపకాలు, ఆనాటి తరగతిలో విశేషాలను ఒకరికొకరు జ్ఞాపకం చేసుకుంటూ సరదాగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. గణేష్, కిషోర్, దుర్గాప్రసాద్, ఝాన్సీ, శిరీష పాల్గొన్నారు.

మహనీయుడు ఎన్టీఆర్

దెందులూరు: విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, మాజీ ముఖ్యమంత్రి టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు మహనీయుడని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శనివారం దెందులూరులోని కూడలిలో దివంగత ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యేతోపాటు పలువురు నాయకులు పూలమాలు వేసి నివాళులర్పించారు.